క్లుప్తంగా

రిటైర్డ్ టీచర్ రూ.లక్ష విరాళం



ఐనవోలు : మండలంలోని సింగారం జెడ్పీహెచ్ఎస్‌లో హెచ్ఎంగా విధులు నిర్వర్తించిన గుడి రవీంద్రశర్మ అక్టోబర్ 2024న ఉద్యోగ విరమణ పొందారు. గురువారం రిటైర్డ్ టీచర్ రవీంద్ర శర్మ- పరంశ్రీ దంపతులు సింగారం ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు, పలు అభివృద్ధి కోసం రూ.లక్ష విరాళం ప్రకటించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు ఖాత వెంకటమ్మ, హెచ్ఎం మధుసూదన్‌రెడ్డికి అందించారు. కాగా పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేసి ప్రాథమికంగా అవసరమైన మౌలిక సదుపాయాలను గుర్తించి వాటి అభివృద్ధి కోసం ఈ నిధులు ఖర్చు చేస్తామని ఏఏపీసీ చైర్మన్ వెంకటమ్మ తెలిపారు. ఈ సందర్భంగా రిటైర్డ్ టీచర్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్‌భాస్కర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రశాంత్, మమత, మంజులాల్, శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటితోనే ఆరోగ్యం

ఐనవోలు : మిషన్ భగీరథ నీటితో ఆరోగ్యం లభిస్తుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవికుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా అధికారులు ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ పరిసరాలు శుభ్రపరిచి, ఓపెన్ వెల్స్‌ను క్లోరినేషన్ చేశారు. అలాగే గ్రామాల్లో ఇతర నీటి వనరులైన బోర్లు, మోటర్ల పరిసరాలు పరిశుభ్రం చేశారు. మిషన్ భగీరథ నీరు తాగడం వలన కలిగే లాభాలను వివరిస్తూ ఆర్వో ప్లాంట్ నీరు తాగడం వలన కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఐనవోలు : స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని వెంకటాపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి మాదాసి హర్షవర్ధన్ ఎంపికయ్యాడు. నవంబర్ 29వ తేదీన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. కాగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఈనెల 7 నుంచి 9 వ తేదీ వరకు జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో హర్షవర్ధన్ పాల్గొనున్నట్లు హెచ్ఎం డాక్టర్ రమేశ్ తెలిపారు. ఏఏపీసీ అధ్యక్షురాలు పద్మావతి, ఉపాధ్యాయులు అభినందించారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

వేలేరు : ప్రభుత్వం నిషేదించిన పొగాకు, గుట్కా ఉత్పత్తులను కిరాణాలకు విక్రయిస్తున్న పోలేపల్లి రాజయ్యను పట్టుకున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు. పెట్రోలింగ్ చేస్తున్న కానిస్టేబుల్స్ వెంకటయ్య, సంపత్ అతడిని తనిఖీ చేయగా పట్టుకున్నట్లు తెలిపారు. మండలంలోని గుండ్లసాగర్ గ్రామానికి చెందిన రాజయ్య వేలేరులోని ముక్తీశ్వర్ అనే వ్యక్తికి చెందిన షాపులో గుట్కాలు విక్రయిస్తుండగా అటుగా వెళ్లిన పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశాడు. సిబ్బంది అప్రమత్తమై ఇద్దరిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.1,086 విలువచేసే గుట్కా ప్యాకెట్లను పట్టుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హన్మకొండ చౌరస్తా: పరకాల పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమతి లేని రూ.79,800 విలువైన నిషేధిత గుట్కాలు, అంబర్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్ తెలిపారు. పరకాల పట్టణంలోని సాయినగర్‌లో రేపాల చంద్రశేఖర్‌గుప్తా నివాసంలో నిల్వచేసి ఉన్న పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని నిందితుడిని పరకాల పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు వివరించారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నాగరాజు

శాయంపేట : యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన సాదు నాగరాజు గురువారం ఎన్నికయ్యారు. ఇటీవల నిర్వహించిన పార్టీ అంతర్గత ఎన్నికల్లో ఆయన అత్యధిక ఓట్లు సాధించారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన కాంగ్రెస్ యూత్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

గెస్ట్ టీచర్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

వేలేరు : మండలంలోని కేజీబీవీ జూనియర్ కళాశాలలో గెస్ట్ టీచర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ స్రవంతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జువాలజీ సబ్జెక్ట్ బోధించేందుకు ప్రస్తుత విద్యా సంవత్సరానికి మాత్రమేనని, యూనివర్సిటీ నుంచి ఎంఎస్సీ జువాలజీ, బీఎడ్ పూర్తిచేసిన మహిళ అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈనెల 6 నుంచి 8 వరకు కేజీబీవీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 6302494148లో సంప్రదించాలని తెలిపారు.

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ కళాశాలలో ఖాళీగా ఉన్న పీజీసీఆర్‌టీ-నర్సింగ్ పోస్టును తాత్కాలిక పద్ధతిన భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ అనితాదేవి గురువారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసే అభ్యర్థులు ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఎస్సీ నర్సింగ్, ఎమ్మెస్సీ నర్సింగ్ అర్హత కలిగి ఉండాలని తెలిపారు.

వానరాలతో భయాందోళన

- ఇంటి పనులు చేసుకోకుండా ఇబ్బందులు
- చేతిలో కర్రలేకుంటే దాడి చేస్తున్న వైనం
- అడవికి తరలించాలని పలువురి విజ్ఞప్తి



ఆత్మకూరులో రోడ్డుపై వానరాల గుంపు

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో వానరాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వానరాల గుంపుతో జనం హడలిపోతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇళ్లు, రోడ్ల మీదకి చేరుకుని పాదచారులపై దాడులు చేస్తున్నాయి. ఇళ్లల్లో మహిళలు పనులు చేసుకోలేక పోతున్నామని వాపోతున్నారు. వానరాలు రోడ్డుపైకి రావడంతో వాహనదారులు సైతం భయాందోళన చెందుతున్నారు. గ్రామాల్లో కూరగాయలు, ఇతర సామాను తెచ్చుకునేవారిపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానరాల దాడులను నివారించేందుకు గతంలో గ్రామపంచాయతీ సిబ్బంది కొండెంగను చెప్పించారు. అయితే కొండెంగ పలువురిపై దాడి చేయడంతో అతీకష్టం మీద కొండెంగను పట్టుకుని అడవిలో వదిలేశారు. తాజాగా వానరాలతో జనాలు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామపంచాయతీల ప్రత్యేకాధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని అడవిలో వదిలేసే విధంగా కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు. వానరాల నుంచి తమను కాపాడాలని, ఇప్పటికైనా దృష్టి సారించాలని అంటున్నారు. అలా చేయని పక్షంలో గ్రామాల్లో వానరాల దాడికి తట్టుకోలేమని వివిధ గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

బయటికెళ్లాలంటే భయమేస్తోంది



గ్రామంలో వానరాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఒకే సారి మందగా చేరి గంటల తరబడి బీభత్సం సృష్టిస్తున్నాయి. పాలకులు, అధికారులు స్పందించిన చర్యలు తీసుకోవాలి.

- గుండెబోయిన కుమారస్వామి

అడవికి తరలించాలి



కోతులు రావడం వలన ఇళ్లలో మహిళలు పనులు చేసుకోలేక పోతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటే జంకుతున్నారు. కోతులను పట్టుకొని అడవిలో వదిలేయాలి.

- పొగాకుల సంతోష్, ఆత్మకూరు

అర్హులకు త్వరలో ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : మండలంలోని అర్హులందరికీ త్వరలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, ప్రజా ప్రభుత్వంలో ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని నర్సింహులపల్లి, గట్లకానిపర్తి, సూరంపేట, గోవిందాపూర్, పెద్దకోడెపాక, కొప్పుల, కాట్రపల్లి, రాజుపల్లి, అప్పయ్యపల్లి, హుస్సేన్‌పల్లి గ్రామాల్లో గురువారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో పాలన కొనసాగిస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరకాలంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, సింగరేణి కారుణ్య నియమకాలు, 7,090 మెడికల్ ఉద్యోగాలు, 8,300 గురుకులాల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. అనంతరం మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే రైతు వేదికలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో భాగంగా రైతులకు ఉచిత మినుముల సీడ్‌ను అందించారు. అంతకు ముందు శాయంపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన సాదు నాగరాజును శాలువాతో సన్మానించారు. ఎంపీడీఓ ఫణిచంద్ర, ఏఓ గంగాజమున, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే వంట మనుషులుగా..

- బిల్లులు చెల్లించలేదని మధ్యాహ్న భోజన నిర్వాహకుల గైర్హాజరు



మధ్యాహ్న భోజనం వండుతున్న ఉపాధ్యాయులు

ఐనవోలు : మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, తాము వంట చేయమని మధ్యాహ్న భోజన నిర్వాహకులు గైర్హాజరయ్యారు. దీంతో ఉపాధ్యాయులే గంటె కలబెట్టి భోజనం తయారీ చేసి విద్యార్థులకు వడ్డించారు. ఈ సంఘటన మండలంలోని గర్మిళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం చోటుచేసుకుంది. పాఠశాలలో సుమారు రూ.40 వేల మధ్యాహ్న భోజన బిల్లులు పెండింగ్ ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ క్రమంలో తామకు బిల్లులు రావడం లేదని గురువారం నుంచి భోజనం తయారీ మానివేస్తామని హెచ్ఎం రజితకు సమాచారం అందించారు. గురువారం వంట చేసేందుకు ఆలస్యంగానైనా వస్తారని ఉపాధ్యాయులు భావించినా నిర్వాహకులు రాలేదు. దీంతో మధ్యాహ్న భోజనాన్ని ఉపాధ్యాయులు రజిత, శివశంకర్, నర్సింహారెడ్డి, రఫీ, ఆరోగ్యమ్మ, శేషగిరి స్వంతంగా కూరగాయలు, వంట సామాను తెప్పించుకుని భోజనాన్ని తయారీ చేసి విద్యార్థులకు వడ్డించారు.

తహసీల్దార్ ఆకస్మిక తనిఖీ

గర్మిళ్లపల్లి ఎంపీపీఎస్ పాఠశాలకు చేరుకున్న తహసీల్దార్ విక్రమ్‌కుమార్ అవాక్కారు. మధ్యాహ్న భోజనాన్ని టీచర్లు తయారీ చేస్తుండడంతో సమస్య ఏంటో అడిగితెలుసుకున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు తెలుపనున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ పాఠశాలలను సందర్శించారు.

పేదింటి ఆడపిల్లలకు వరం కల్యాణలక్ష్మి



చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేలేరు : పేదింటి ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి పథకం వరంగా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ ఎర్రబెల్లి గ్రామశాఖ అధ్యక్షుడు ముద్దసాని వరుణ్ అన్నారు. గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఆర్ఐ సురేందర్ ఆధ్వర్యంలో చెక్కుల పంపిణీ గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు చెక్కులను అందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పేదల సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. మరిన్ని పథకాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కిశోర్, శ్రవణ్, ప్రవీణ్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభాపాటవ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో గణితఫోరం మండల అధ్యక్షుడు దాస్యం శ్రీరాం ఆధ్వర్యంలో గణితంలో ప్రతిభపాటవ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల, ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, పత్తిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు 33 మంది పాల్గొన్నారు. ఈ ప్రతిభపాటవ పోటీల్లో ప్రథమ బహుమతి ఎస్.కీర్తన, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, ద్వితీయ బహుమతి ఎ.చెందన జెడ్పీహెచ్ఎస్ పత్తిపాక, తృతీయ బహుమతి ఎస్. అక్షయ శాయంపేట, ప్రభుత్వ బాలికల పాఠశాల, ఎంజేపీ, సోషల్ వెల్ఫేర్ విభాగంలో ప్రథమ బహుమతి వి.శివసాయి, ప్రదీప, ద్వితీయ స్థానంలో కె.సాత్విక్, తతీయ స్థానంలో గణశ్ బహుమతులు సాధించగా శాయంపేట ఎంఈఓ భిక్షపతి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా గట్లకానిపర్తి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మంత్రి శ్రీనివాస్ ప్రథమ బహుమతి పొందిన కీర్తనకు రూ.500 నగదు బహుమతి అందించారు. మండల స్థాయిలో గెలుపొందిన ఆరుగురు విద్యార్థులు ఈనెల 11న జరిగే జిల్లాస్థాయి ప్రతిభపాటవ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

దివ్యాంగులు అడ్డంకులను అధిగమించాలి

- ఎంపీడీఓ అనిల్ కుమార్



దివ్యాంగ ఉద్యోగిని సన్మానిస్తున్న ఎంపీడీఓ

ధర్మసాగర్ : దివ్యాంగ పిల్లల్లో అద్భుతమైన శక్తి, సంకల్పం, ధైర్యం ఉంటుందని అడ్డంకులను అధిగమించి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎంపీడీఓ అనిల్ కుమార్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఈఓ రాంధన్ అధ్యక్షతన గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దివ్యాంగ విద్యార్థులు రోజువారి జీవితంలో వచ్చే అడ్డంకులను అధిగమించి అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు వారికి చేయూతనివ్వాలన్నారు. దివ్యాంగుల సాధికారత కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని దివ్యాంగ విద్యార్థులు ఆసరగా తీసుకుని ప్రగతి పథంలో ముందుకెళ్లాలని అన్నారు. అనంతరం మండలంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన దివ్యాంగ విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి సన్మానించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం మురళి, బాలుర ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ధర్మప్రకాశ్, ఉపాధ్యాయులు సరస్వతి, శ్రీనివాస్, పద్మ, సీఆర్పీలు పద్మ, రణుప, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వేలేరు : అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై అజ్మీర సురేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని పీచర గ్రామంలో ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ అనిల్, హోంగార్డు సంపత్‌కు ఇసుక ట్రాక్టర్ తారసపడినట్లు తెలిపారు. ఇసుక తరలింపు అనుమతి పత్రాలను లేని కారణంగా ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సైబర్ కేసు నమోదు

దామెర : అత్యాచారం చేశాడని నమ్మించి లక్ష రూపాయలు దోచుకున్న ఘటన దామెర పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఊరుగొండకు చెందిన చెల్పూరి సంపత్ ఆర్ఎంపీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో నవంబర్ 21వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు సంపత్ ఫోన్ నంబర్‌కు కాల్‌చేసి సంపత్‌కు బంధువైన సురేష్ ఒక మహిళను అత్యాచారం చేశాడంటు నమ్మించాడు. అంతేకాకుండా ఆమె చావుబతుకుల్లో కొట్టుమిట్టులాడుతుందని, వెంటనే లక్ష రూపాయలు పంపించాలని కోరాడు. దీంతో సదరు వ్యక్తికి మొదట రూ.1000, తరువాత రూ.19,000, రూ.20,000, ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా పంపించాడు. అనంతరం తన బంధువులు, స్నేహితుల ద్వారా మరో రూ.40 వేలు పంపించాడు. అయినప్పటికీ పోలీస్ కేసు నుంచి తప్పించడానికి మరో రూ.60వేలు కావాలంటూ అడగడంతో అనుమానం వచ్చిన సదరు బాధితుడు.. గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్రంలో నియంతృత్వ పాలన

- పీఏసీఎస్ డైరెక్టర్ సత్యనారాయణరావు
- బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా, రాస్తారోకో
- సీఎం ఫ్లెక్సీ దహనానికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు



రోడ్డుపై ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కమలాపూర్ : ప్రజా సమస్యలపై ప్రశ్నించిన వారిని అక్రమంగా అరెస్టులు చేసి నియంతృత్వ పాలనకు కాంగ్రెస్ నిదర్శనంగా నిలుస్తోందని పీఏసీఎస్ డైరెక్టర్ సత్యనారాయణరావు ఘాటు విమర్శలు చేశారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్య అని అన్నారు. భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో చేపట్టారు. స్థానిక బస్టాండ్ కూడలిలో హుజూరాబాద్-పరకాల ప్రధాన రహదారిపై బైఠాయించి సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీ దహనానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం సత్యనారాయణరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా అని ప్రశ్నించారు. మానవ హక్కులను హరింపజేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాప్ చేస్తూ ప్రశ్నించిన వారిని అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని, అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాగా ఆందోళనలో పాల్గొన్న పలువురు బీఆర్ఎస్ నాయకులను స్థానిక పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు దాసరి శ్రీనివాస్, మాట్ల వెంకటేశ్వర్లు, లడె గోపాల్, పుల్ల శ్రీనివాస్, శనిగరపు సమ్మయ్య, మాట్ల రాజు, పాక రవి, ఎండపల్లి మల్లారెడ్డి, సాంబయ్య, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాల్చితే భూమికి నష్టం



ఆత్మకూరు : అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రీనివాస్

ధర్మసాగర్ : వరి కొయ్యలను కాల్చడం వలన భూమికి, వాతావరణానికి ప్రమాదం సంభవిస్తుందని ఏఈఓ పవన్‌కల్యాణ్ అన్నారు. మండలంలోని పెద్దపెండ్యాలలో గల రైతు వేదికలో ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా నేల సంరక్షణపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి కొయ్యలను కాల్చడం వలన భూమి సారాన్ని కోల్పోవడం జరుగుతుందన్నారు. ముఖ్యమైన పోషకాలు తగ్గిపోవడం, ప్రకృతి సమతుల్యత దెబ్బతినడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటాయని అన్నారు. దీనికి బదులుగా వరి కొయ్యలను నేలలో కలియదున్నడం ద్వారా సేంద్రియ కర్బన శాతం పెరిగి దిగుబడులు 10 శాతం మెరుగుపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

వేలేరు : ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ కవిత మాట్లాడుతూ.. రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను అధికంగా వినియోగించాలని సూచించారు. నేలలు సారవంతంగా ఉండేందుకు పచ్చిరొట్ట ఎరువుగా జీలుగా, జనుము, పెసర వంటి పంటలను వేసి నాటు సమయంలో కలియదున్నితే నేలలో కర్బన శాతం పెరిగి భూమి సారవంతంగా తయారవుతుందన్నారు. రైతులు భూసార పరీక్షలు చేసుకుని దానికి తగ్గట్లుగా ఎరువులను వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రాజశేఖర్, విజయ్‌కుమార్, బిందు, రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : వరికొయ్యలు కాల్చడం వలన నేల దెబ్బతిని సారవంతం పోతుందని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ప్రపంచ మృత్తిక (నేల) దినోత్సవం సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరికోతలు పూర్తైన తర్వాత కొయ్యలను కాల్చొద్దని, మృత్తిక సంరక్షణపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. మృత్తిక బాగుంటే పంటలు సమృద్ధిగా సాగవుతాయని అన్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి

- డీఆర్డీఓ శ్రీను



నర్సరీ పనులు పరిశీలిస్తున్న డీఆర్డీఓ శ్రీను

నడికూడ : నర్సరీలోని మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని డీఆర్డీఓ శ్రీను అన్నారు. గురువారం మండలంలోని కంఠాత్మకూరులో గల గ్రామపంచాయతీ ఆవరణలో నర్సరీ నిర్వహణను పరిశీలించి గ్రామానికి చెందిన పరమాండ్ల రాజయ్య ఈజీఎస్ నిధులతో మంజురైన పశువులపాక నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. నర్సరీలో పెంచే మొక్కలపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, కరోబార్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజుగౌడ్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పరకాల : ఆటో, టాక్సీ డ్రైవర్‌ల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఈనెల 7వ తేదీన నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగ్గు రాజుగౌడ్ పిలుపునిచ్చారు. బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పట్టణంలో ఏఐటీయూసీ నాయకులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగ్గు రాజుగౌడ్ మాట్లాడుతూ.. 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ఆటో డ్రైవర్‌ల సమస్యలను పట్టించుకోకపోగా కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పేరుతో మహిళలకు ఉచిత ప్రయాణాలు కల్పించి ఆటో డ్రైవర్లకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఈనెల 7న నిర్వహించనున్న రాష్ట్ర వ్యాప్తబంద్‌ను తలపెట్టినట్లు తెలిపారు. నాయకులు రాములు, వేణు, రమేశ్, రాజేందర్, రాజు, ఖలీల్, సాంబయ్య పాల్గొన్నారు.

అపార మేధావి శ్రీనివాస రామానుజన్



ఐనవోలు : విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ విక్రమ్‌కుమార్



ఎల్కతుర్తి : విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నోడల్ ఆఫీసర్ వెంకటరమణారెడ్డి

ఎల్కతుర్తి : గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వివిధ పాఠశాలలకు చెందిన పదోతరగతి విద్యార్థులకు గణిత టాలెంట్ టెస్టు నిర్వహించారు. అనంతరం టీఎంఎఫ్ మండల అధ్యక్షుడు రామాంజనేయులు సమావేశానికి అధ్యక్షతన వహించగా మండల నోడల్ ఆఫీసర్ వెంకటరమణారెడ్డి, స్థానిక కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవాణి హాజరై విజేతలకు సర్టిఫికెట్లు అందించారు. ఈ ఫలితాల్లో ప్రథమస్థానంలో నిలిచిన ఎల్కతుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గోలిపెల్లి హర్షవర్ధన్, ద్వితీయస్థానంలో గోపాల్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి చరణ్‌తేజ్, తృతీయస్థానంలో దామెర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రణధీర్ విజేతలుగా నిలిచారు. అలాగే తెలుగు మీడియం ప్రథమస్థానంలో సూరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అన్వేష్, ఎల్కతుర్తి టీఎస్ రెసిడెన్షియల్ విద్యార్థి సాత్విక, ద్వితీయ, తృతీయ స్థానాల్లో అక్షయ, రిష్విత్ విజేతలుగా నిలిచినట్లు తెలిపారు. విద్యార్థులకు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందించారు.

ఐనవోలు : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జన్మదినం సందర్భంగా మండలస్థాయి గణిత ప్రతిభా పాటవ పరీక్ష నిర్వహించారు. కాగా 10 ఉన్నత, కేజీబీవీ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మండలస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జి.రాంచరణ్ (సింగారం), పి.వర్ష (పంథిని), ఎస్.శివాని (ఒంటిమామిడిపల్లి) విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికయ్యారు.

వేలేరు : తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల పదోతరగతి విద్యార్థులకు మండలస్థాయి గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు టీఎంఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్, ప్రధానకార్యదర్శి దయాకర్ తెలిపారు. ప్రథమ స్థానంలో జెడ్పీహెచ్ఎస్ పీచర విద్యార్థిని కల్యాణి బేగం, ద్వితీయస్థానంలో అక్షయ, తృతీయస్థానంలో ఎర్రబెల్లి విద్యార్థి వెంకటేశ్, గురుకుల విభాగంలో ప్రథమ స్థానంలో వర్షిణి, ద్వితీయ స్థానంలో ధనుంజయ్, తృతీయ స్థానంలో మండల హర్షిత నిలిచారు.

'రేవూరి' పరామర్శ

ఆత్మకూరు : సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర మాజీ కార్యదర్శి, సీనియర్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిదిరాల సుధాకర్‌రెడ్డికి మాతృ వియోగం కలుగగా గురువారం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు ఉన్నారు.